# కిడ్స్ - కీపిటప్

తాతయ్య పోయి పదేళ్లయ్యింది.

అయినా ప్రతి సంవత్సరం తాతయ్య పేర్న పెద్ద తతగం జరుగుతుంది ఈరోజు ఇళ్లన్నీ కడుగుతారు. ముగ్గులెడతారు. ఆడవాళ్ళు మడిపేరున సినిమాల్లో డ్యాన్సులు చేసేవాళ్ళలాగా బట్టలు వొళ్ళంతా కనబడేటట్లు కట్టుకుంటారు.

వూహ తెల్సినప్పట్నించి చిట్టి ఈ క్రతువునంతా ఆశ్చర్యంగా చూస్తూనేవున్నాడు.

ఆరోజు చుట్టప్రక్కల వూళ్ళల్లో వుండే అతడి బాబాయిలు, అత్తలు అంతా వచ్చేస్తారు. ఫ్యాంట్లు తొడుక్కునే మగాళ్ళంతా ఆరోజు పంచెలు కట్టి, వీభూతిరేకలు దిద్దుకుని వరుసగా శివలింగాల్లాగా కూర్చుంటారు. కాస్సేపటికి ఇద్దరు బ్రామ్మలొస్తారు. ఇంట్లోనే మంటపెట్టి నాన్నా, బాబాయిలు అంతా దాని చుట్టూ కూర్చుంటారు. బేమ్మడు మంత్రాలు చదువుతుంటే వాళ్ళేమో పూజలు చేస్తారు. కాస్సేపటికి బేమ్మలకి అన్నంపెట్టి తినమని అందరూ దణ్ణాలు పెడతారు. వాళ్ళేమో సినిమాల గురించి మాట్లాడుతూ మెల్లిగా తింటారు. అలా తిన్నందుగ్గాబోలు వాళ్లు లేవంగానే డబ్బులిచ్చి మళ్లీ దండాలెడతారు. అప్పుడుగాని తనకి అన్నం పెట్టరు.

అదీ చిట్టిగాడి బాధ.

ఇతంతా ఏవిటని అడిగితే ఆరోజు చచ్చిపోయిన తాతయ్యొస్తాడంటుంది వాళ్ళమ్మ. తాతయ్యొస్తే ఈ తతంగం అంతా దేనికి మరి వచ్చివాడు కనిపించడేం ? అలా అని అడిగితే దేవుడు, చచ్చిపోయిన వాళ్ళు కనిపించరంటుంది. వాళ్ళమ్మ దేవుడికైతే గుడుంది. అలాగ తాతయ్యకి గూడా ఓ గుడి కట్టించేస్తే పోలా ? ఏవిటో వాళ్ళమాటలు వాళ్ళకేం అర్ధంకావాలి.

చిటి అరుగుపైన కూర్చునున్నాడు. ఎండ ఎర్రగా వుంది కాని చిట్టికి కడుపులో ఎండ కాస్తున్నట్లుగా వుంది. వుదయం స్కూలుకి పంపేటప్పుడు రాత్రి మిగిలిన అన్నం కలిపి తినమంది వాళ్ళమ్మ.

కాని చిట్టికి సహించింది కాదు. అదంతా అలాగేవదిలి సంచీ భుజానవేసుకుని స్కూలుకెళ్ళిపోయేడు. మధ్యాహ్నం ఇంటికొచ్చేసరికి ఇంకా లోపల్నించి మంత్రాలు

వినిపిస్తున్నాయ్. చిట్టిని చూసిని వాళ్ళమ్మ “ అయిదు నిమిషాలు అలా అరుగుపైని కూర్చో – అన్నం తిందువు గాని ” అంది. నిజమే ననుకుని అలాగే వీథి అరుగుపైని కూర్చున్నాడు.

అరగంటయినా పూజ పూర్తికాలేదు. ఆకలి భరించలేక చిట్టి వాళ్లేంచేస్తున్నారో అన్చెప్పి కిటికీలోంచి లోనిఇక చూసేడ. బేమ్మలు మెల్లిగా కబుర్లు చెప్పుకుంటూ తింటున్నారు. వాళ్ళ నాన్నేమో వాళ్ళకి తాటాకు విసనకర్రతో విసురుతున్నాడు.

చిట్టికి వొళ్ళు మండిపోతయింది. కడుపుభగ్గుమంది.

అంతలో పొట్టి భోంచేసి మళ్ళీ స్కూలుకని రానేవచ్చాడు.

“ నేనింకా అన్నం తిన్లేదురా – నువ్వెళ్ళిపోతావా ? ” దిగులుగా అడిగాడు.

పొట్టి అడ్డంగా తలవూపి , అరుగుపైని చతికిలపడ్డాడు.

అంతలో అతడొచ్చాడు. వయోభారం చేత నడుం వంగిపోయింది. వొళ్ళు ముడతలుపడింది పళ్ళు లేని నోరు వర్షంలో తడిసిని మట్టిరోడ్డులా వుండి, ఆకలిచేత కళ్ళు పొట్టలోపలికి పీక్కు పోయినాయ్. “ అన్నం తిని మూడ్రోజులైంది. గుప్పెడు మెతుకులు పెట్టించు బాబూ, ప్రాణం పోతావుంది ” అన్నాడు. అతి దీనంగా చిట్టి అతడి వంక తేరపారి చూసేడు ఇక్క క్షణం మండుతున్న కడుపు అతడికేదో సాపత్యంచూపించి. అంతలో వాళ్ళమ్మ లోపల్నుంచి – “ ఇప్పుడేం పెట్టకూడదె.....వెళ్ళమను వెధవని ” అంటూ అరిచింది.

ఆ ముసలి కర్రాడించుకుంటూ పోబోతుండగా చిట్టికేదో ఆలోచనొచ్చి. “ ఏయ్ – ఆగు ” అని చివ్వున దొడ్డివైపు నించి ఇంటివెనక భాగానికెళ్లాడు. రేకుల షెడ్డుక్రింద అన్నం కూరలు గారెతో పళ్ళెంలో పోసి పెట్టున్నాయ్. ఎవరూ లేరు. అదే అధనుగా రెండు చేతుల్తోను పట్టినన్ని గారెలు పుచ్చుకుని వీథిలోకొచ్చి ముసలాడి బొచ్చెలో వేసాడు. మెరిసిన అతడి కళ్ళల్లో చిట్టికి వాళ్ళ తాతయ్య కనిపించేడు. ఆకలిగూడా తగ్గింది.

------- అయ్యిపోయింది -------